క్లుప్తంగా

విద్యుత్ అధికారుల దాడులు

మార్టూరు: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అధికారులు మంగళవారం నిర్వహించిన దాడుల్లో 44 మంది వినియోగదారులపై కేసులు నమోదు చేసినట్లు అద్దంకి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నర్రా మస్తాన్‌రావు తెలిపారు. స్థానిక ఏఈ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న ఇద్దరిపై, అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న నలుగురిపై, అదనపు లోడు వినియోగిస్తున్న 38 మంది మొత్తం 44 మందిపై కేసులు నమోదు చేసి వారికి రూ.2.81 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్టూరు డీఈఈ సురేంద్రబాబు, అద్దంకి డివిజన్‌లోని పలువురు ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

104లో డ్రైవర్, డేటా ఎంట్రీ పోస్టులకు దరఖాస్తులు

చీరాల రూరల్/వేటపాలెం: ఏఈఎంఎస్ 104 వాహనాలలో డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104 జోనల్ మేనేజర్ పి. రాకేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై హెవీ లైసెన్స్ కలిగి ఉండాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు డిగ్రీ ఉత్తీర్ణులై కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని సూచించారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, బ్యాంక్ అకౌంట్, ఆధార్, నాలుగు పాస్‌పోర్ట్ ఫోటోలు అందించాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేటి నుంచి ఈనెల 20వ తేదీ లోగా ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చీరాల ప్రభుత్వాసుపత్రిలో పూర్తిచేసిన దరఖాస్తులు అందించాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికై నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు జిల్లాలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

13 నుంచి పర్చూరులో క్రికెట్ పోటీలు

పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13 నుంచి 21వ తేదీ వరకు పర్చూరులో దక్షిణ భారత స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తులసి శివనాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ సౌజన్యంతో నాకౌట్ పద్ధతిలో జరిగే పోటీల్లో 16 జట్లు పాల్గొనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, రెండో బహుమతి రూ.2 లక్షలు, మూడో బహుమతి రూ.1 లక్ష లుగా నిర్ణయించినట్లు ఆయన వివరించారు. వీటితో పాటు మరికొన్ని కన్సోలేషన్ బహుమతులు కూడా ఉంటాయన్నారు.

15న పర్చూరులో రాష్ట్రస్థాయి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు..

సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల15వ తేదీ సాయత్రం 7 గంటలకు పర్చూరులో డ్యాన్స్ బేబీ డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక డాన్స్ మాస్టర్ నటరాజ్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఈ జరిగే ఈ పోటీలకు నృత్య కళాకారులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. మెదటి బహుమతిరూ.7,116, రెండో బహుమతి రూ.5,116, మూడో బహుమతి రూ.3,116, నాలుగో బహుమతి రూ.2,116 గా నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు

- ప్రజా సంకల్పయాత్ర ఒక చరిత్ర
- వేడుకలు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



చీరాలలో కేక్ కట్‌చేసి ఆనందం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అద్దంకి రూరల్: ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం అవుతారని అద్దంకి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీఎం జగన్ ప్రజా సంకల్పయాత్ర పూర్తై నేటి ఐదేళ్లు అయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా భద్రారెడ్డి మాట్లాడుతూ యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను నెరవేర్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధులకు పెన్షన్ రూ. 3 వేల పెంచారన్నారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో తొలుతగా మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పానెం నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అద్దంకిలో కేక్ కట్ చేసి నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఏఎంసీ చైర్మన్ భద్రారెడ్డి

చారిత్రాత్మకం ప్రజా సంకల్పయాత్ర..

చీరాల: ప్రజల కష్టాలను కళ్లారా చూడటానికి వారికి భరోసా కల్పించేందుకు ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్పయాత్ర చారిత్రాత్మక ఘట్టమని మున్సిపల్ వైస్ చైర్మన్ బి.జైసన్‌బాబు, పార్టీ పట్టణాధ్యక్షుడు కోండ్రు బాబ్జి అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ ఆదేశాలతో మంగళవారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ నేతలు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యకర్తలు, నాయకులు సమక్షంలో భారీ కేక్ కట్ చేసి అందరికి స్వీట్లు పంపిణీ చేశారు. మళ్లీ సీఎంగా జగనన్నను చేసేంతవరకు ఉపక్రమించమన్నారు. కార్యక్రమంలో పార్టీ రూరల్, వేటపాలెం అధ్యక్షులు ఎ.అంకాశరెడ్డి, బి.సుబ్బారావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు సురేష్, శివపార్వతి, యూత్ అధ్యక్షుడు జగ్గారావు, అశోక్, మున్సిపల్ కౌన్సిలర్లు బి.అనీల్, కె.అరుణ్, జి.ప్రబాకరరావు, ఎ.శ్రీనివాసరెడ్డి, నాయకులు కేశవులు, వాసిమళ్ల వాసు, సుధీర్, సుబ్బారావు, వెంకటేశ్వరమ్మ, పోతురాజు తదితరులు ఉన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



దర్గాను సందర్శించడానికి వచ్చిన భక్తులు



సుందరంగా పూలతో అలంకరించిన దర్గా

వేటపాలెం: జాండ్రపేటలో చీరాల–ఒంగోలు రోడ్డు పక్కన గల పేరుగాంచిన దాదా అమీన్‌పీర్ దర్గా వద్ద 48వ గంధ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అఖండ దీపారాధన, మహాత్ముల పేరిట బమాన్ నిర్వహించారు. దర్గాను రంగు రంగుల దీపాలతో సుందంగా అలకంరించారు. పకీర్ల జల్సాలతో బ్యాండు వాయిద్యాలతో బాణసంచాలతో గంధం మెరవణి చేశారు. కులమతాలకు అతీతంగా చీరాల, వేటపాలెం, పందిళ్లపల్లి, ఇంకొల్లు, పర్చూరు దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకొన్నారు. పకీర్ల ఆశ్వీర్వాదం తీసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో దర్గా ప్రాంతం జనాలతో కిటకిటలాడింది. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గొప్ప సంఘసంస్కర్త షేక్ ఫాతిమా

చీరాల రూరల్: ఎంతో మంది బడుగు, బలహీన, ముస్లిం మైనార్టీ వర్గాల మహిళలకు విద్యనందించి చరిత్రలో సంఘ సంస్కర్తగా షేక్ ఫాతిమా చిరస్థాయిగా నిలిచిపోయారని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ బాజీ షరీఫ్ అన్నారు. మొట్ట మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జయంతి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ముస్లిం షాదీఖానాలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఆనాటి కాలంలో షేక్ ఫాతిమా ఎంతో ప్రయాసలకోర్చి మహిళలకు విద్య నేర్పించి వారిని చైతన్య పరచడం మంచి పరిణామమని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సిర్రా భగత్ సింగ్, గొర్రెపాటి రవికుమార్, కాటి మార్క్స్, అబ్దుల్ కలామ్, షేక్ మస్తాన్ బి, షేక్ ముంతాజ్, షేక్ మూర్తి ఆర్బి, షేక్ స్వర్ణబాబు, ఫాతిమ, హసీనా, గౌస్య, ముంతాజ్ బేగం, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



అద్దంకిలో ఫాతిమా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ ఐక్యవేదిక సభ్యులు

అద్దంకి: సంఘసంస్కరణలో, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని నిమ్నజాతులవారికి అపార సేవలు అందించిన షేక్ ఫాతిమా ఆదర్శవంతురాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్ బాబు అన్నారు. స్థానిక బధిరుల ఆశ్రమ పాఠశాలలో షేక్ ఫాతిమా జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలోట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, విద్యాన్ జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, ఉబ్బా దేవపాలన, చిన్ని మురళీకృష్ణ, సయ్యద్ ఖాశిం వలి, సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సినీనటుడు రఘుబాబు



ప్రారంభోత్సవంలో బ్యాటింగ్ చేస్తున్న కరణం చెంచు పున్నయ్య చౌదరి

- తొలిరోజు విజేతలుగా హైదరాబాద్, వైజాగ్ జట్లు

మేదరమెట్ల: అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు సంబరాలతో మొదలయ్యాయి. కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, భ్రమర సంక్రాంతి కప్ పేరుతో నిర్వహిస్తున్న టీ–20 క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన రెండు మ్యాచ్‌ల్లో చిక్కోల్ చీతాస్ (వైజాగ్), కోకా ఇన్‌ఫ్రా(హైదరాబాద్) జట్లు విజయం సాధించాయి. ఉదయం జరిగిన మ్యాచ్ జీడీసీఏ లెవెన్ గుంటూరు–చిక్కోలీ చీతాస్ వైజాగ్ జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న వైజాగ్ బౌలర్ల దాటికి జీడీసీఏ లెవెన్ గుంటూరు జట్టు 15 ఓవర్లు మాత్రమే ఆడి 89 పరుగులు చేసి అలౌట్ అయ్యింది. వైజాగ్ జట్టు బౌలర్లు సాత్విక్ కేవలం 3 ఓవర్లు వేసి 21 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. మరో బౌలర అబ్దుల్లా 3 ఓవర్లలో 18 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టు బ్యాటర్లకు చుక్కలు చూపించారు. అనంతరం 90 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన వైజాగ్ మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి కేవలం 9.2 ఓవర్లలో విజయ లక్ష్యాన్ని చేరుకున్నారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరాబాద్–సీడీసీఏ లెవెన్ తిరుపతి జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఆరంభించిన కోకా ఇన్‌ఫ్రా హైదరాబాద్ బ్యాట్స్‌మెన్ ధాటికి తిరుపతి జట్టు బౌలర్లు చేతులేత్తేశారు. 20 ఓవర్లలో ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి హైదరాబాద్ జట్టు 213 పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టులో తేజ కేవలం 59 బంతుల్లో 119 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి జట్టు 18.4 ఓవర్లలో 106 పరుగులు మాత్రమే చేసి అలౌట్ అయ్యింది. దీంతో హైదరాబాద్ జట్టు 107 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

చుట్టుపక్కల ఎక్కడా లేనివిధంగా అద్భుతమైన స్టేడియం..

భ్రమర సంక్రాతి కప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం చెంచు పున్నయ్య చౌదరి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రికెట్ స్టేడియం కానీ పిచ్ గానీ సమీపంలో ఎక్కడా లేని విధంగా ఉందన్నారు. కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు యర్రా రఘుబాబు అధ్యక్షత వహించారు. తనదైన శైలిలో ఆయన ప్రేక్షకులను నవ్వుల్లో మునిగేలా చేశారు. కార్యక్రమంలో భ్రమర టౌన్‌షిప్ ఎండీ గళ్లా రామచంద్రరావు మాట్లాడుతూ 30వ టీ20 అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని, నాకౌట్ కం లీగ్ పద్ధతిలో జరిగే పోటీల్లో 16 జట్లు పాల్గొంటాయన్నారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటున్నాయన్నారు. మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, రెండో బహుమతిగా రూ.2 లక్షలు, మూడో బహుమతిగా రూ.1 లక్ష అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బీ.జవహర్, ఎస్.మోహన్‌దాస్, అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరావు, కార్యదర్శి ప్రతాప్, కార్యవర్గ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.



సెంచరీ చేసిన కోకా ఇన్‌ఫ్రా జట్టు బ్యాటర్ తేజ

నేటి మ్యాచ్‌లు..

ఉదయం యువన్ ప్రాపర్టీస్ హైదరాబాద్, ఎంఆర్‌సీసీ లెవెన్ చెన్నై జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. మధ్యాహ్నం మ్యాచ్ సౌత్‌జోన్ సీసీ చెన్నై– అస్పైర్ లెవెన్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనే లక్ష్యం

యద్దనపూడి: ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించటమే జగనన్న ఆరోగ్యసురక్ష లక్ష్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని పూనూరు గ్రామంలోని సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య శ్రీకార్డులను, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. వైద్యపరీక్షలు అనంతరం మెరుగైన చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ వర్తించే ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 228 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహర్ష, జి. వైష్ణవి, లక్ష్మిప్రవంతి, అప్తాలజిస్ట్ మంజుబార్గవి, సీహెచ్‌ఓ ప్రసాద్, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్, సర్పంచ్ మేకా సుధాకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాలవారీగా పేదలందరికి మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేసిందని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు నిర్వహించారు. క్యాంపులో 301 మందికి వివిధ రకాల పరీక్షలతో మందులు పంపిణీ చేశారు.



కొత్తూరులో రోగికి ఈసీజీ చేస్తున్న వైద్యులు

శిబిరంలో వైద్యాధికారులు భారతి, మమత, సుకన్య, సిద్ధార్థ, సర్పంచ్ హెచ్ అశ్విని, ఎంపీటీసీ అంజమ్మడీయి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చినగంజాం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా ప్రతి కుటుంబంలో సంపూర్ణ ఆరోగ్యం ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎంపీడీఓ కె.స్వరూపారాణి అన్నారు. మంగళవారం మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 348 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లబోతు పద్మావతి, వైద్యాధికారులు ఎస్. విజయభాస్కర్‌రావు, పి. సాయిశ్రీచరణ్, గడ్డం పృథ్వీ, కె.షణ్ముకశ్రీ, 104 డీఈవో పొదిలి రాఘవ, సూపర్‌వైజర్లు మురళి, చిరంజీవి, మహేష్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



ఆసుపత్రిలో ఉన్న రవిశంకర్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన పెదపూడి రవిశంకర్ అనారోగ్య కారణంగా ఒంగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో వలంటీర్ కవల జయరాణి మంగళవారం గ్రామంలోని పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ముగించుకొని 50 కిలో మీటర్లు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవిశంకర్‌కు నగదు అందజేసింది. దీంతో స్థానికులు జయరాణిని అభినందించారు.

మార్టూరులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



కేంద్ర పథకాలను ప్రచారం చేస్తున్న ప్రత్యేక వాహనం

మార్టూరు: మండలంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్రను అధికారులు ప్రారంభించారు. రాజుపాలెం, డేగరమూడి గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న 25 రకాల పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హత కలిగి పథకాలు పొందలేకపోతున్న వారి వివరాలను అధికారులు సేకరించి యాత్రకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్ స్పెషల్ ఆఫీసరు వి. శ్రీనివాసరావు సచివాలయాల సిబ్బంది రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

చీరాల రూరల్: అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన న్యాయవాదులకు ఉపయుక్తంగా ఉండే 2024 సంవత్సరానికి సంభందించిన నూతన క్యాలెండర్లను మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు మాట్లాడుతూ క్యాలెండర్లు ముద్రించిన ఫౌండేషన్ నిర్వాహకుడు సీనియర్ న్యాయవాది పినిపె రామకృష్ణకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాపట్ల పార్లమెంట్ కన్వీనర్ కె. వాసుబాబు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఆర్. వెంకటేశ్వర రెడ్డి, న్యాయవాదులు ఎం. పుల్లయ్య, ఎ. రత్నం, సిహెచ్. సురేష్, ఐ. పవన్ కుమార్, ఎం. రవికుమార్, జి. సురేష్, ఎస్. రాము, కె. ఉదయభాస్కర్, ఎం. తారక, చైనత్య, ఈశ్వరి రెడ్డి, విఠల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాతమల్లాయపాలెంలో పొట్టేళ్ల పందేలు

బల్లికురవ: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామంలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద ఆదివారం పొట్టేళ్ల పందేల పోటీలు నిర్వహిస్తున్నట్లు జూపల్లి రాఘవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే ఈపోటీల్లో విజేతలకు రాఘవరావు మొదటి బహుమతిగా రూ. 61 వేలు, రెండో బహుమతి రూ. 31 వేలను ముద్దపాటి చంద్రశేఖరరావు, మూడో బహుమతి రూ. 21 వేలను సారెడ్డు మణి తేజ, నాలుగో బహుమతి రూ. 10116 జడ వెంకట కోటేశ్వరరావు అందిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే పొట్టేళ్లకు రంగులు వేయరాదని, ఎర్ర ముచ్చు పొట్టేళ్లకు ప్రవేశం లేదని, మరిన్ని వివరాలకు 63054 33005 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగాలు సాధ్యం



సదస్సులో మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

అద్దంకి రూరల్: ఉపాధితో కూడిన నైపుణ్యాన్ని యువత సాధించాలని స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జే. గోపీనాథ్ అన్నారు. మంగళవారం అద్దంకి వైఎస్సార్ క్రాంతి కార్యాలయంలో యువతకు ఉద్యోగ ఉపాధి 'నైపుణ్యాభివృద్ధి అవకాశాలు–సవాళ్లు' అనే అంశంపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ పులిపాటి వీరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోపినాథ్ మాట్లాడుతూ నైపుణ్యంతో కూడిన చదువులు చదవకపోవటంతో యువత నిరుద్యోగులుగా ఎక్కువ శాతం ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యాలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డీబీఆర్సీ రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, వైఎస్సార్ క్రాంతి పథం అద్దంకి ప్రాజెక్టు మేనేజర్ చవళం కోటేశ్వరరావు, పులిపాటి ఏబేలు, ఆర్ నరసింహారావు, మంద జోసఫ్, కొమ్మాలపాటి శివ కుమార్, అల్లాడి ఆంజనేయులు, గాలి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్‌తో అవ్వాతాతల్లో ఆనందం



లబ్ధిదారులకు ఫించన్ పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

ఇంకొల్లు (చినగంజాం): ఇచ్చిన హామీని నిలబెట్టుకొని పింఛన్ పెంపుదల చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బండారు ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం ఇంకొల్లు పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ప్రభుత్వం పెంచిన ఫించన్ రూ.3 వేలు నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని నేరవేర్చిన ఆయన మరలా సీఎంగా గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విజయవాడలో నిర్మాణం జరుపుకుంటున్న అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణానికి దళితులంతా ఏకమై సంసిద్ధత వ్యక్తం చేశారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీపీ అనూష, సర్పంచ్ ఏచేర్ల ప్రసన్న, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, షమీమ్, సుభాని, ప్రసంగి, చలమయ్య, జేసీఎస్ కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, వలంటీర్లు, పాల్గొన్నారు.